జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శనివారం | 19-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 787 పేజీలు: 4 వెల : రూ.7

## గ్రూపులు కడితే..
# క్షమించేది లేదు





సోంపేట,సెప్టెంబర్18(వార్త): ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసీపీ నాయకుల తీరు మారాలని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల్లో పార్టీ పట్ల మంచి ఆలోచన ఉన్నప్పటికీ నేతల ఆలోచన విధానమే పార్టీకి సమస్యగా మారిందని అన్నారు. కొంతమంది నేతలు తీరు వల్ల అభ్యర్థి గెలుపు కన్నా ఓటమి కోసం ప్రయత్నం చేస్తూ నియోజకవర్గంలో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ పరిస్థితి మారకపోతే ఇకపై పార్టీ పరంగా కఠిన చర్యలు తప్పవని అటువంటి నాయకులను నిర్మొహమాటంగా పక్కన పెడదామని ఘాటుగా హెచ్చరించారు. డాక్టర్ నిమ్మన దాసు అధ్యక్షతన సోంపేటలో ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసిపి విస్తృత స్థాయి సమావేశంలో శుక్రవారం ధర్మాన ప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం నేతల ఉచ్చులో పడి ఇచ్ఛాపురం వైసీపీలో కొంతమంది నాయకులు పార్టీని ఇబ్బంది పెడుతున్నారని తప్పనిసరిగా వారు తీరు మార్చుకోవాలని గుర్తు చేశారు. పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తే నియోజకవర్గంలో వైసిపిలో ప్రతి నాయకునికి, కార్యకర్తకు గౌరవం ఉంటుందని అన్నారు. పార్టీ అభ్యర్థి ఓటమికి కృషి చేస్తే ఐదేళ్లపాటు ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టుకుని అత్యంత హీనంగా బతకాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ప్రతి గ్రామం నుంచి తనకు ప్రతిరోజు సమాచారం ఉందని తప్పు చేసిన నాయకులను క్షమించేది లేదని హెచ్చరించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రతి సామాజిక వర్గానికి వైయస్ జగన్ తగు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. ఎవరికి ఎటువంటి లోటు చేయకుండా ప్రాధాన్యమిస్తున్నప్పటికీ ఎన్నికల సందర్భంలో కొంతమంది నేతలు అనుసిస్తున్న తీరు అన్యాయంగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నాయకులు పట్ల కార్యకర్తలు నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన నాయకులను నిర్మొహమాటంగా నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

### హామీల డాబు... అప్పుల బాబు..

ఎన్నికల ముందు ప్రజలకు హామీలతో అరచేతిలో స్వర్గం చూపించిన చంద్రబాబు గద్దెనెక్కిన తర్వాత ఎడాపెడా అప్పులు చేస్తూ మూడున్నర లక్షల కోట్లతో దేశంలో రికార్డు సృష్టించారని ధర్మాన విమర్శించారు. చంద్రబాబు అనుకూల మీడియాలో అభివృద్ధి చూపించడం తప్ప రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి లేదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయం మొదలైన రంగాలను ఎంతగానో అభివృద్ధి చేసి చూపించిన పరిస్థితి ఉండగా ప్రస్తుతం రాష్ట్రాన్ని చంద్రబాబు అధోగతి పాలు చేశారని విమర్శించారు.

### రాష్ట్రంలో తొలి విజయం శ్రీకాకుళం నుంచే..

రానున్న స్థానిక ఎన్నికల్లో శ్రీకాకుళం కార్పొరేషన్‌లో రాష్ట్రంలోనే వైసీపీ తొలి విజయం సాధిస్తుందని ధర్మాన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ తీరు పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఇదే ఆత్మవిశ్వాసం ప్రతి నియోజకవర్గం క్యాడర్లోను ఉండాలని అన్నారు.

### గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి..

సమావేశంలో జిల్లా వైసీపీ సమన్వయకర్త ధర్మాన కృష్ణ దాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీ ఛైర్ పర్సన్ పిరియా విజయ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని అన్ని విధాల అధోగతి పాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. ప్రతి మంగళవారం అప్పులు చేయకపోతే రాష్ట్రాన్ని నడిపించలేని స్థితికి చంద్రబాబు తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. జగన్ పాలన ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని అన్నారు. సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు, పార్టీ పరిశీలకుడు కుంభ రవిబాబు, ఇచ్ఛాపురం సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగ్రవాల, నర్తు నరేంద్ర, సిలగాన భాస్కరరావు, పైల దేవదాసు రెడ్డి, బోర పుష్ప, ఇప్పిలి లోలాక్షి, ఇప్పిలి కృష్ణారావు, ఉప్పాడ నారాయణమ్మ, ఉలాల భారతి దివ్య, ఉలాల కోదండరాం, కడియాల ప్రకాష్, మామిడి శ్రీకాంత్, హర్షవర్ధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

✳ ఇచ్ఛాపురం వైసీపీ నేతల తీరు మారాలి ✳ ప్రజల్లో పార్టీ పట్ల మంచి ఆలోచన ఉంది.. నేతల్లోనే లేదు ✳ కొంతమంది తీరు వల్ల పార్టీకి నష్టం ✳ టీడీపీ ఉచ్చులో పడొద్దు ✳ తప్పు చేసిన నాయకులను క్షమించం ✳ నియోజకవర్గంలో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ✳ కూటమి నేతల తప్పును ప్రజల్లోకి తీసుకువెళ్లండి ✳ రాష్ట్రంలో తొలి విజయం శ్రీకాకుళం నుంచే వస్తుంది ✳ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు హెచ్చరిక ✳ ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

# పాతపట్నంలో జన పాలన ఏది?

కొత్తూరు, సెప్టెంబర్ 18 (వార్త): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. కొత్తూరు మండల కేంద్రంలోని బోర శ్రీరాములు కళ్యాణ మండపంలో వైఎస్సార్సీపీ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలతో ఆమె విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని, నాయకులు , కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు. కూటమి ప్రభుత్వ పాలనపై రెడ్డి శాంతి తీవ్ర విమర్శలు చేశారు. పాతపట్నం నియోజకవర్గంలో ప్రజా పాలన కనిపించడం లేదని, మద్యం, కబ్జాలు, ఇసుక, కమీషన్ల వ్యవహారాలే ప్రధానంగా మారాయని ఆమె ఆరోపించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలు, కబ్జాలు, ఇసుక వ్యవహారాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రోడ్ల పనుల పరిస్థితిపైనా ఆమె ప్రశ్నలు సంధించారు. వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిన పనులు చాలా కాలం గడిచినా పూర్తికాకుండా నిలిచిపోయాయని విమర్శించారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ, పనుల నాణ్యత, జాప్యంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్న విషయాన్ని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, ఇతర హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, వృద్ధులకు పింఛన్ల పెంపు వంటి హామీలను ప్రస్తావిస్తూ వాటి అమలుపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశం అనంతరం మండల కమిటీ నాయకులు, గ్రామ అధ్యక్షులకు వైఎస్సార్సీపీ ఐడీ కార్డులను రెడ్డి శాంతి పంపిణీ చేశారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు ఇవి గుర్తింపుగా నిలుస్తాయని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్ఠం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, మండల నాయకులు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



✳ కూటమి పాలనపై రెడ్డి శాంతి ఘాటు విమర్శలు ✳ స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలని పిలుపు ✳ నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు హామీల అమలుపై నిలదీత ✳ శ్రేణులకు ఐడీ కార్డుల పంపిణీ ✳ పార్టీ బలోపేతంపై నాయకులకు దిశానిర్దేశం



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## - 'కాఫీ విత్ ఎమ్మెల్యే'లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



**పాతపట్నం, సెప్టెంబరు 18 (వార్త):** స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'కాఫీ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో పాతపట్నం మండలంలోని పెద్ద సీది, పాసిగంగుపేట, తామర, తీమర గ్రామ పంచాయతీలకు చెందిన తెదెపా నాయకులతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ముఖాముఖిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రజా సమస్యలు, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కూడా నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్లు, మహిళలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని గోవిందరావు పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పారదర్శకంగా పింఛన్ అందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ లక్ష్యమని, అలాగే అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామస్థాయిలో నాయకులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి 40 వినతులను నేరుగా స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే గోవింద రావు ఆదేశించారు.

## ఫ్లెక్సీ చించివేతపై పోలీసులకు ఫిర్యాదు



**మెళియాపుట్టి, సెప్టెంబరు 18 (వార్త):** మెళియాపుట్టిలోని మహేంద్రతనయ నది బ్రిడ్జి సమీపంలో ఆర్ అండ్ బి రహదారికి సమీపంలో జనసేన పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా చించివేశారని ఆ పార్టీ కి చెందిన దుక్క బాలరాజు, చంటి, లక్ష్మీపురం కిరణ్ కుమార్ తదితరులు స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం నాడు ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శాఖల ద్వారా పాతపట్నం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు వివిధ సందర్భాల్లో పవన్ కల్యాణ్‌కు సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ప్రతిసారీ ఇదే విధంగా చించి వేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఈ విషయంపై సమగ్రంగా విచారణ చేపట్టి ఫ్లెక్సీలు చించివేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన పార్టీ కార్యకర్తలు పోలీసులకు తెలియజేస్తూ ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో జనసేన పార్టీ నాయకులు బాలరాజు తోపాటు లక్ష్మీపురం కిరణ్‌కుమార్, సవర రామ్మూర్తి, సవలాపురం చంటి, రట్టి ఫల్గుణరావు పాల్గొన్నారు.

## మండల స్థాయి జాతీయ సైన్స్ సెమినార్‌లో లక్ష్మీ సహస్రకు ప్రథమస్థానం



**పాతపట్నం, సెప్టెంబరు 18 (వార్త):** మండల స్థాయిలో నిర్వహించిన జాతీయ సైన్స్ సెమినార్ పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్ కు చెందిన పదో తరగతి విద్యార్థిని బల్లెడ లక్ష్మీ సహస్ర ప్రథమ స్థానం సాధించింది. 'భారతీయ ఇంధన బాస్కెట్-2047 ' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో లక్ష్మీ సహస్ర అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఈ పోటీలను స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖాధికారులు గోవిందరావు, తిరుమలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి న్యాయ నిర్ణేతలుగా జూనియర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ రామారావు, ఎంఈఓ తిరుమలరావు వ్యవహరించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని లక్ష్మీ సహస్రను పాఠశాల ప్రిన్సిపల్ రత్నకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## పోలీసులకు సహకరించండి




**మెళియాపుట్టి, సెప్టెంబరు 18 (వార్త):** గ్రామాలలో పోలీసులు చేపడుతున్న వివిధ అంశాలకు సంబంధించి గ్రామస్తులు ప్రజలు ప్రతి ఒక్కరూ పోలీసులకు అన్నివేళలా సహకరించాలని పాతపట్నం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె వెంకటరావు అన్నారు. సుందరాడ గ్రామంలో శుక్రవారం పాతపట్నం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమంపై ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై సంకల్పం కార్యక్రమం లక్ష్యాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తూనే గ్రామాలలోని ప్రజలు పోలీసులకు సహకరించాలని, చట్టపరమైన అంశాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా ఎవరికైనా అపరిచిత వ్యక్తులు వంటివారికి తరస పడితే పోలీసులకు సమాచారం తెలియ పరచగలరన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరావు తోపాటు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా హిందీ దినోత్సవం



**సోంపేట, సెప్టెంబరు 18 (వార్త):** జాతీయ భాష హిందీ నేర్చుకోవడం ద్వారా భవిష్యత్ విద్యా ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుచు కోవాలని సోంపేట మండల విద్యాశాఖాధికారి ఎస్.జోరాడు పేర్కొన్నారు. జాతీయ హిందీ భాషా వారోత్సవాల్లో భాగంగా బారువాకొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జీ. తారకేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన హిందీ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు బారువా కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయులు జీ తారకేశ్వర రావు, కే గోపి, ఎల్ రాజారావు లను ఘనంగా సన్మానించారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీ తారకేశ్వర రావు, జీ.వెంకటస్వామి పాల్గొని పాఠశాలకు అభివృద్ధికి ఐదువేల రూపాయల విరాళం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కే. వెంకటరమణ, ఎం సునీత, పి. సత్యవతి, కే. నాగరాజు, జి. శివశంకర్, కి.కృష్ణవేణి, జీ. రాజేష్, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సరుబుజ్జిలి ఎస్సైగా చిరంజీవులు

**సరుబుజ్జిలి, సెప్టెంబరు 18 (వార్త):** సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ ఎస్సైగా ఎస్ చిరంజీవులు శుక్రవారం విధుల్లోకి చేరారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ హైమావతి బదిలీపై శ్రీకాకుళం టూ టౌన్ స్టేషను వెళ్లారు. అప్పటి నుంచి ఆమదాలవలస స్టేషన్ నుంచే సూర్యనారాయణ సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. వీఆర్ ఉన్న చిరంజీవులను జిల్లా ఎస్పీ పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించ డంతో విధుల్లో చేరారు.



## పీఎంఎఫ్ఎంఈ, సీడ్ కాపిటల్ స్కీంలపై అవగాహన




**వజ్రపుకొత్తూరు/మందస, సెప్టెంబరు 18(వార్త):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గొడబ ప్రసాదరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో నేషనల్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ క్యాంపైన్, పీఎంఎఫ్ఎంఈ(ప్రధానమంత్రి ఫార్మలిజేషన్ అఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్), సీడ్ క్యాపిటల్ గ్రాడ్యుషన్ పై వీఓఏలకు, ఎంఎస్ ఓబీలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. శిక్షణా కార్యక్రమంలో భాగంగా ప్రసాదరావు గొడబ మాట్లాడుతూ సీడ్ కాపిటల్ రిసైక్లింగ్ లో భాగంగా 40,000రూపాయలు అప్పు తీసుకొని తిరిగి అప్పు కట్టిన లబ్ధిదారులకు 75,000 రూపాయలు మరల అప్పు ఇవ్వవచ్చని తెలిపారు. పీఎంఎఫ్ఎంఈ యాక్టివిటీ ఉన్నట్లు అయితే వాళ్ళకు అప్పు మహిళా సభ్యులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సంఘాలలో పీఎంఎఫ్ఎంఈ యాక్టివిటీ చెయ్యడానికి కొత్త మహిళా సభ్యులను గుర్తించాలని సూచించారు. వచ్చే అక్టోబర్ 15వ తేదీ లోపు ప్రతి గ్రామ సంఘం పరిధిలో పీఎంఎఫ్ఎంఈ, సీడ్ క్యాపిటల్ గ్రాడ్యుషన్ డే ఉత్సవాలను నిర్వహించాలని వీఓఏలకు చెప్పారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, కోశాధికారి చంద్రకళ, సీసీలు హరిప్రియ, రేణుక, వీఓఏలు, అకౌంటెంట్ మీనా పాల్గొన్నారు.

## అన్నదానానికి మను యాదవ్ చేయూత



**పలాస, సెప్టెంబరు 18(వార్త):** రెంటికోటలోని శ్రీశ్రీశ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ సన్నిధిలో యాదవ్ ప్రొటెక్షన్ ఫోరం (వైపీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆదివారం అన్నదాన మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి యువ నాయకుడు, న్యాయవాది మను యాదవ్ తనవంతు సహాయంగా నాలుగు బస్తాల బియ్యం (104 కిలోలు), ఐదు లీటర్ల నూనెను విరాళంగా అందించారు. అన్నదాన కార్యక్రమానికి పలువురు దాతలు కూడా తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దశాబ్దంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న మను యాదవ్ గత దశాబ్ద కాలంగా అన్నదానం, విరాళాలు అందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటున్నారని వైపీఎఫ్ సభ్యులు తెలిపారు. సేవా కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మను యాదవ్ మాట్లాడుతూ అన్నదాన మహాప్రసాదాన్ని భక్తులందరూ స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, స్థానిక సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాధవరావు, హేమసుందర్, సుదర్శన్‌రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొని మను యాదవ్‌ను అభినందించారు.

## సవర గెడ్డలో చిక్కుకున్న వ్యక్తికి తప్పిన ప్రాణాపాయం

### -పోలీసులు, ఫైర్ సిబ్బంది, స్థానికుల సమన్వయంతో రక్షణ..
### -ప్రభుత్వాసుపత్రికి తరలింపు



**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** గరుడకండి గ్రామ సమీపంలోని సవర గెడ్డలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి గుర్రపు డెక్కలో చిక్కుకున్న గుర్తుతెలియని వ్యక్తిని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు సమన్వయంతో శుక్రవారం రక్షించారు. నీటిలో చిక్కుకున్న వ్యక్తిని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్పందించిన కాశీబుగ్గ ఎస్ఐ దుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, కూటమి నాయకులుశ్రీ శయన రాష్ట్ర సాధికారిక నెంబర్ బూర్ల కృష్ణంరాజు, తులసిరావు, సీతారాం, గ్రామస్థులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా శ్రమించి నీటిలో చిక్కుకున్న వ్యక్తిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం 108లో అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు వైద్య వర్గాల తెలిపాయి. ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే స్పందించి సహాయక చర్యల్లో స్వయంగా పాల్గొన్న కాశీబుగ్గ ఎస్ఐ దుర్గాప్రసాద్‌ను స్థానికులు అభినందించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది, స్థానికుల సమన్వయంతో సకాలంలో రక్షణ చర్యలు చేపట్టడంతో ప్రాణాపాయం తప్పిందని గ్రామస్థులు వెల్లడించారు.

## మున్సిపల్ సేవల ప్రైవేటీకరణ ఆపాలి




**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సేవలను ప్రైవేటీకరించే చర్యలను నిలిపివేయాలని, వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటు చేసి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ద

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వెంకటి, బి.కూర్మారావు మాట్లాడుతూ వర్క్ కాంట్రాక్టు పేరుతో మున్సిపల్ సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల కార్మికులపై, ప్రజలపై అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. ప్రజలకు నేరుగా అందాల్సిన పారిశుద్ధ్య తదితర మున్సిపల్ సేవలను ప్రైవేటీకరణ నుంచి కాపాడాలని కోరారు. వేతన సవరణ చేపట్టాలని, కార్మికుల వేతనాలను సవరించేందుకు పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. మున్సిపాలిటీలో మృతి చెందిన, పదవీ విరమణ చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు నిబంధనల ప్రకారం ఉద్యోగావకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీల భర్తీతోనే పని భారం తగ్గుతుందని, ఆప్‌కాస్ సైట్‌ను నిలిపివేయడంతోపాటు కొత్తగా ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడం వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై అదనపు పని భారం పడుతోందని నాయకులు తెలిపారు. పారిశుద్ధ్య సేవలు సక్రమంగా కొనసాగాలంటే అవసరమైన మేరకు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ మేనేజర్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.రవి, కె.ఈశ్వరరావు, యస్.రమేష్, రజేష్, ప్రకాష్‌ముఖి, గులాబీ, శకుంతల, సావిత్రి, నాగభూషణ తదితరులు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## హాస్టల్ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ పోరుబాట

**పలాస/శ్రీకాకుళం, సెప్టెంబరు 18 (వార్త):** జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిష్కారానికి పోరాటం చేపట్టనున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం తెలిపారు. ఈ నెల 21 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్ల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళంలోని క్రాంతిభవన్‌లో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణంతో పాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్, రవి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర సంక్షేమ హాస్టళ్లను సందర్శించి అక్కడి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తామని తెలిపారు. భోజనం నాణ్యత, మెస్ మెనూ అమలు, తాగునీరు, వసతి గదులు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, పారిశుద్ధ్యం, స్టడీ అవర్స్, పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రి తదితర అంశాలను పరిశీలిస్తామన్నారు. అధికారిక రికార్డులకే పరిమితం కాకుండా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను నమోదు చేస్తామని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్ బిల్లులను పెంచాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులకు తగిన పరిమాణంలో నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందేలా నిధులు కేటాయించాలని కోరారు. తక్కువ మెస్ బిల్లుల కారణంగా ఆహార నాణ్యతపై ప్రభావం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనేక సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో, సరైన మౌలిక వసతులు లేని భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, వంటశాల, భోజనశాల తదితర సౌకర్యాలతో అన్ని హాస్టళ్లకు శాశ్వత సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ సందర్శనల్లో గుర్తించిన సమస్యలను నమోదు చేసి సమగ్ర నివేదిక రూపొందించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నాయకులు తెలిపారు. సంబంధిత సంక్షేమ శాఖలపై ఒత్తిడి తెచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే విద్యార్థులను సమీకరించి దశలవారీగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హర్షవర్ధన్, గౌరీ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



## 25న బొడ్డపాడులో పైలా చంద్రమ్మ వర్ధంతి సభ




**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాట యోధురాలు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శిగా, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేసిన కామ్రేడ్ పైలా చంద్రమ్మ ఆరో వర్ధంతి సభ ఈ నెల 25న బొడ్డపాడులో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు తెలిపారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. చంద్రమ్మ 2020 సెప్టెంబరు 23న కరోనాతో మృతి చెందారు. ఆమె వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న సభకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం బొడ్డపాడులోని అమరవీరుల స్మారక భవనం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విప్లవాభిమానులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులకు ఆయన పిలుపునిచ్చారు. ఉద్యమాలపై చర్చించాలని, పైలా చంద్రమ్మను స్మరించుకోవడం కేవలం వర్ధంతి కార్యక్రమానికే పరిమితం కాకుండా, శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటం అనంతరం కొనసాగిన వివిధ ప్రజా ఉద్యమాల ప్రస్థానాన్ని చర్చించుకోవడానికి వేదికగా మారాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ అన్నారు. ప్రస్తుత పాలక విధానాలపై తమ దృష్టికోణంలో ప్రజా వ్యతిరేకత ఉందని భావిస్తున్న అంశాలను చర్చించి, వాటిపై ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతం చేయడమే అమరవీరులకు, ఉద్యమ నేతలకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గౌరకల బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు వంకల పాపయ్య, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ, ఆదివాసీ సంఘం నాయకులు సవర బంగ్లా కుమార్, మురిపింటి తాతారావు పాల్గొన్నారు.

## కవితా పోటీల్లో మార్పు ప్రతిభ



**మందస, సెప్టెంబరు 18(వార్త):** శ్రీ శ్రీ కళా వేదిక నిర్వహించిన కవితల పోటీలలో మందస మండలంలోని బిన్నలమదనాపురం గ్రామానికి చెందిన కవి, రచయిత, ఉపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు ప్రతిభ చూపారు. డాక్టర్ బోయి భీమన్న జయంతి సందర్భంగా పద్మభూషణ్ డా.బోయి భీమన్న-సాహిత్య వైభవం అనే అంశంపై కవితల పోటీ నిర్వహించారు. ఫలితాలు శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు ప్రకటించారు. బిన్నలమదనాపురం గ్రామానికి చెందిన కవి మార్పు జగన్మోహనరావు విజేతగా నిలిచారు. ఆయనకు శ్రీశ్రీ కళావేదిక నుంచి ప్రశంసాపత్రం అందింది. మార్పు జగన్మోహనరావుకు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులు, గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు అభినందించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# ఏపీటీపీసీకి రూ.2.34 కోట్ల లాభం

**- 2023-24లో రూ.272.89 కోట్ల అమ్మకాలు..**

**- ఆర్థిక నివేదికల్లో 'నిల్ కామెంట్స్'**

**- చైర్మన్ వజ్జ బాబూరావు అధ్యక్షతన**

### 55వ వార్షిక సర్వసభ్య సమావేశం



**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) 2023--24 ఆర్థిక సంవత్సరంలో రూ.272.89 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. ఇతర ఆదాయాలు కలుపుకొని, పన్నులకు ముందు రూ.2.34 కోట్ల లాభాన్ని ఆర్జించిందని, సంస్థ ఆర్థిక కార్యకలాపాల్లో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ, ఆడిట్ ప్రక్రియలను పూర్తి చేసినట్లు వెల్లడైందని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు వెల్లడించారు. మంగళగిరిలోని ఏపీటీపీసీ కార్యాలయంలో చైర్మన్ వజ్జ బాబూరావు అధ్యక్షతన శుక్రవారం కార్పొరేషన్ 55వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన సంస్థ ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన నివేదికలను సమావేశంలో సమీక్షించారు. ఆదాయ, వ్యయాలు, ఆడిట్ నివేదికలు, సంస్థ ఆర్థిక పనితీరుపై అధికారులు వివరాలు వెల్లడించారు. రూ.272.89 కోట్ల అమ్మకాలు జరిపి 2023-24లో ఏపీటీపీసీ మొత్తం రూ.272.89 కోట్ల అమ్మకాలు సాధించిందని అన్నారు. ఇందులో పేపర్ ఉత్పత్తుల విక్రయాలు రూ.26.74 కోట్లు కాగా, ఇతర ఉత్పత్తుల అమ్మకాలు రూ.246.15 కోట్లుగా నమోదయ్యాయని, సంస్థకు వివిధ మార్గాల ద్వారా రూ.9.33 కోట్ల ఇతర ఆదాయం సమకూరిందని చెప్పారు. అదే సమయంలో సంస్థ మొత్తం ఖర్చులు రూ.279.01 కోట్లుగా నమోదయ్యాయని, ఇందులో కొనుగోలు చేసిన మెటీరియల్ వ్యయం రూ.268.75 కోట్లు, ఉద్యోగుల ప్రయోజనాలకు రూ.3.37 కోట్లు, ఇతర ఖర్చులు రూ.6.89 కోట్లుగా ఉన్నట్లు ఆర్థిక నివేదికలో వెల్లడించారు. ఆడిట్‌లో 'నిల్ కామెంట్స్'గా నమోదయాని, సంస్థ 2023-24 ఆర్థిక నివేదికలను 2024 ఏప్రిల్ 26న జరిగిన బోర్డు సమావేశంలో సమర్పించినట్లు నివేదికలో వెల్లడించారు. కాగ్ (కాగ్) నియమించిన విజయవాడకు చెందిన ఎం/ఎస్ తిరుమలరావు అండ్ కో., చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ చట్టబద్ధమైన ఆడిట్ నిర్వహించిందని తెలిపారు. కాగ్ సూచనల మేరకు స్టాట్యూటరీ ఆడిటర్లు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. కాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సప్లిమెంటరీ ఆడిట్‌లోనూ సంస్థ ఆర్థిక నివేదికలపై 'నిల్ కామెంట్స్' నమోదైనట్లు సమావేశంలో వెల్లడించారు. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత, లెక్కల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.34 కోట్ల లాభం సాధించడం పట్ల చైర్మన్ వజ్జ బాబూరావు సంతృప్తి వ్యక్తం చేశారు. సంస్థ పురోగతిలో భాగస్వాములైన ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది, ఇతర వర్గాలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ సంస్థ కార్యకలాపాలను మరింత సమర్థంగా నిర్వహిస్తూ ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఈ సమావేశంలో వైస్ చైర్మన్, ఎండీ శేఖర్‌బాబు, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆదినారాయణ, జేడీ ఇండస్ట్రీస్ జి.కృష్ణారావు, డిప్యూటీ సెక్రటరీ (ఇండస్ట్రీస్) హనుమంతరావు, ఏపీటీపీసీ జీఎం హనుమ నాయక్, కంపెనీ సెక్రటరీ కరుణాకర్, అకౌంట్స్ మేనేజర్ శ్రీరామ్ ప్రసాద్, జె.వి.శ్రీనివాస శాస్త్రి, డిప్యూటీ సెక్రటరీ, శివ నాగరాజేశ్వరి, ఎం.వెంకటేశ్వర్లు, ఆశీష్ ముందేకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఇండియన్ ఎనర్జీ బాస్కెట్--2047' సెమినార్ పోటీలు

**- జిల్లా స్థాయికి కాశీబుగ్గ విద్యార్థిని ఎంపిక**



**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు 'ఇండియన్ ఎనర్జీ బాస్కెట్-2047' అంశంపై మండల స్థాయి సెమినార్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఇంధన భద్రత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఇంధన వనరుల వినియోగం, ప్రత్యామ్నాయ ఇంధనాల ప్రాధాన్యంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని పది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇంధన రంగంలో భవిష్యత్ అవసరాలు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాశీబుగ్గకు చెందిన పాత్రో తేజస్విని ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 21న శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పోటీలకు పీ. గౌరీశంకర్, కేశవరావు, చలపతిరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లా స్థాయికి ఎంపికైన తేజస్వినిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సిహెచ్. శ్రీనివాసరావు, సిహెచ్. సత్యంతో పాటు వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై ఆటోలతో ఇబ్బందులను అరికట్టండి



**జలుమూరు, సెప్టెంబరు 18 (వార్త):** ఎర్రన్నపేట గ్రామంలో ప్రధాన రహదారిపై ఇరువైపులా ఆటోలను నిలిపివేయడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై ఆటోలు వరుసగా నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ద్విచక్ర వాహనాలు సైతం సులభంగా వెళ్లేందుకు మార్గం లేకుండా పోతోందని పేర్కొన్నారు. రహదారి ఇరువైపులా వాహనాలను నిలిపివేయడం వల్ల తరచూ ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు గ్రామస్తులు శుక్రవారం ఎస్సై అశోక్‌బాబును కలిసి సమస్యను వివరించారు. ప్రధాన రహదారిపై ఆటోల నిలుపుదలతో ఏర్పడుతున్న ఇబ్బందులను పరిశీలించి, సమస్యకు తక్షణ పరిష్కారం చూపుతామని ఎస్సై హామీ ఇచ్చారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## లింగాలవలస సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

**- ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన**

**- విద్యుత్ సాంకేతిక అంశాలపై ప్రత్యక్ష పరిశీలన**

**జలుమూరు, సెప్టెంబరు 18 (వార్త):** కరవంజలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి వృత్తి విద్యా విభాగం ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ విద్యార్థులు లింగాలవలస సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. వృత్తి విద్యలో భాగంగా నిర్వహించిన ఈ పారిశ్రామిక సందర్శన ద్వారా విద్యార్థులకు విద్యుత్ రంగానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా, వివిధ పరికరాల పనితీరు, విద్యుత్ వ్యవస్థకు సంబంధించిన సాంకేతిక అంశాలను విద్యార్థులు పరిశీలించారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా గమనించడంతో వారికి ప్రాయోగిక జ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు మరింత మెరుగుపడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సబ్‌స్టేషన్ పనితీరుకు సంబంధించిన పలు అంశాలను తెలుసుకుని, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వృత్తి విద్యా ఉపాధ్యాయులు ధర్మాన రాజేశ్వరి, కె. సింహాచలం విద్యార్థులకు మార్గదర్శకత్వాన్ని అందించారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో వృత్తి విద్యా రంగంలో వారికి ఉపయోగపడే నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఇలాంటి పారిశ్రామిక సందర్శనలు దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు.






## రహదారి మరమ్మతులకు మోక్షం!

**రూ.1.50 కోట్లతో బెండి గేట్-దేవనల్తాడ రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం**

**పూండి, వెంకటాపురం, దేవనల్తాడ, నౌపడా గ్రామాలకు తీరనున్న కష్టాలు**

**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలంలోని బెండి గేట్--దేవనల్తాడా ప్రధాన రహదారి మరమ్మతులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో రూ.1.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో రహదారి అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

బెండి గేట్ నుంచి దేవనల్తాడా వరకు ఉన్న ఈ రహదారి పూండి, వెంకటాపురం, దేవనల్తాడా, నౌపడా తదితర గ్రామాలకు కీలకమైన రాకపోకల మార్గంగా ఏర్పడింది. కొంతకాలంగా రహదారి పూర్తిగా దెబ్బతిని పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారి రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మరమ్మతులు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తగ్గడంతోపాటు రాకపోకలు సులభతరం కానున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ ప్రయాణికులతో పాటు రైతులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రహదారి పనులు ప్రారంభం కావడంపై గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గౌతు శిరీషకు కృతజ్ఞతలు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## పాఠశాల నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన

**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అవగాహన కల్పించి, ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని పలాస డివిజన్ ఉప విద్యాధికారి పి. విలియమ్స్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి విద్యార్థి తన వంతు బాధ్యతగా భావించేలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పలాస డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా 'ట్రాన్స్ఫార్మింగ్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్' అంశంపై జాతీయ హరితదళ క్లబ్ (ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల స్థాయిలో పర్యావరణ విద్యను పుస్తకాలకే పరిమితం చేయకుండా ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. మొక్కల పెంపకం, పచ్చదనం పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, వ్యర్థాల నిర్వహణ, నీటి పొదుపు, పరిశుభ్రత, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టే ప్రతి పర్యావరణహిత కార్యక్రమం విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంచేలా ఉండాలని తెలిపారు. ప్రకృతితో మమేకమయ్యేలా కార్యక్రమాలు చేపట్టి కార్యశాలలో పాఠశాలల్లో ఎన్‌జీసీ క్లబ్ ద్వారా చేపట్టాల్సిన పర్యావరణహిత కార్యక్రమాలపై రిసోర్స్ పర్సన్లు వివరించారు. పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాలను 'ప్రకృతి కనెక్ట్' యాప్‌లో నమోదు చేసే విధానం, గ్రీన్ స్కూల్ ప్రోగ్రాంలో పాఠశాలల నమోదు ప్రక్రియ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యకలాపాల అమలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ విద్యను తరగతి గదులకే పరిమితం చేయకుండా విద్యార్థుల రోజువారీ జీవితంలో భాగం చేయడం ద్వారా దీర్ఘకాలికంగా మంచి ఫలితాలు సాధించవచ్చని శిక్షణలో వివరించారు. పాఠశాలలు పచ్చదనం, పరిశుభ్రత, నీటి సంరక్షణ, వ్యర్థాల నియంత్రణలో ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. చిన్నంనాయుడు, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త పూజారి గోవిందరావు, క్లస్టర్ సమన్వయకర్తలు కొయ్యల శ్రీనివాసరావు, ముప్పెన ఈశ్వరి, పలాస డివిజన్‌కు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## వైవిధ్యమైన ఆహారంతోనే సంపూర్ణ పోషణ

**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** బాలల ఆరోగ్యం, శారీరక-- మానసిక వికాసానికి పోషకాహారం ఎంతో కీలకమని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో కె పార్వతి అన్నారు. 9వ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా చిన్న నీలావతి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'వైవిధ్యమైన ఆహారం-తగిన పోషకాలు' అనే అంశంపై తల్లిదండ్రులు, బాలలు, గ్రామ పెద్దలకు అవగాహన కల్పించారు. పిల్లలకు అవసరమైన పోషకాలు అందించేందుకు సమతుల ఆహారం తీసుకోవడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వేడి భోజనం, ఇతర పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పీవో మాట్లాడుతూ బాల్యం జీవితంలో అత్యంత కీలకమైన దశని, ఈ వయసులో శరీర ఎదుగుదలతో పాటు మెదడు, ఎముకలు, కండరాలు, రోగనిరోధక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. అందుకే పిల్లలకు అందించే ఆహారం కేవలం ఆకలి తీర్చేదిగా కాకుండా.. శరీరానికి అవసరమైన అన్ని పోషకాలను అందించేదిగా ఉండాలని చెప్పారు. సరైన పోషకాహారం లభిస్తే పిల్లల శారీరక ఎదుగుదలతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యం, చురుకుదనం కూడా మెరుగుపడతాయని తెలిపారు.

### ఎదుగుదలకు శక్తినిచ్చే ఆహారం

పిల్లల రోజువారీ ఆహారంలో కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచుపదార్థాలు, తగినంత నీరు ఉండటం అవసరం. అన్నం, చిరుధాన్యాలు, గోధుమలు వంటి ధాన్యాలు శక్తినిస్తే.. పప్పులు, శనగలు, పెసలు, మినుములు, గుడ్లు, పాలు, పెరుగు వంటి పదార్థాలు శరీర నిర్మాణానికి అవసరమైన ప్రొటీన్లను అందిస్తాయని చెప్పారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు విటమిన్లు, ఖనిజాలు, పీచుపదార్థాలకు ప్రధాన వనరులు. బాలల ఆరోగ్య పరిరక్షణతోపాటు వారి సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు. 'ఆడండి.. పాడండి.. కలిసి సంతోషంగా గడపండి' అనే సందేశంతో పిల్లల్లో చురుకుదనం, సృజనాత్మకత పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించారు. ఆటలు, పాటలు, రంగులతో పిల్లలకు ఆనందంతో కూడిన అభ్యాసాన్ని అందించారు. దేశవ్యాప్తంగా బాలల పోషణ, ఆరోగ్యం, సంరక్షణ, అభివృద్ధిపై అవగాహన పెంపొందించడమే పోషణ మాసం ప్రధాన ఉద్దేశమని సూపర్‌వైజర్ యూ లతా తెలిపారు. తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేసినప్పుడే బాలలకు మెరుగైన పోషకాహారం అందించడంతోపాటు ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. గిరిజ, బి. సునీత, లలిత, విజయ, రూప, ఏఎన్‌ఎం పార్వతి, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాకుళం

## కైజన్ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు



**మందస, సెప్టెంబరు 18(వార్త):** మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కైజన్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో మందస మండలంలోని కొర్రాయిగేటు సమీపంలో గల కైజన్ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలను నేత్ర వైద్య సహాయాధికారి రోణంకి వెంకటరమణ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. 255మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్ వలన కలిగే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రమేష్, ఆశావర్కర్ పి.భాగ్యవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఛాలెంజెస్ సెమినార్‌లో మహాశ్రీ ప్రతిభ



**మందస, సెప్టెంబరు 18(వార్త):** మండల రిసోర్స్ కేంద్రం(మందస)లో ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ 2047 ప్రోస్పెక్ట్ అండ్ ఛాలెంజస్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో నగిరి మహాశ్రీ ప్రతిభ చూపింది. మందస మండలంలోని సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మహాశ్రీ మొదటి స్థానం కైవసం చేసుకుంది. మందస మండల విద్యాశాఖ అధికారి ఎం.లక్ష్మణరావు చేతుల మీదుగా బహుమతిని స్వీకరించి, ఈ నెల 21న జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగిరి కరుణాకర్, సిబ్బంది, విద్యార్థినికి గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు పి.చంద్రశేఖర్‌ను అభినందించారు.

## కోతుల దాడుల నుంచి రక్షించండి మహాప్రభో



**మందస, సెప్టెంబరు 18(వార్త):** మేజరు పంచాయతీ మందసలో కోతుల బెడద తీవ్రతరమైందని, వీటి నుంచి ప్రజలను కాపాడాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు మందస ఈఓ బమ్మిడి నవీన్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. మందసలో రెండు నెలలుగా కోతుల బెడద తీవ్రంగా ఉందని వారు తెలిపారు. ఇళ్లలోకి చొరబడి ఆహారం, వస్తువులు ఎత్తుకెళ్లడంతో పాటు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు. ఆయా ఘటనల్లో సుమారు 50 మంది గాయపడ్డారని తెలిపారు. కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దున్న హరికృష్ణ, వంకల రమేష్, సుగ్గు జోగ పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలకు రూ.68 వేలు అందించిన టీడీపీ నేత శ్రీరామ్



**పాతపట్నం, సెప్టెంబరు 18 (వార్త):** పాతపట్నం మండలంలోని కొంచాడపేట, గొందిలోవ, సన్యాసిరావుపేట, లాభర రామాలయం వీధి, బొమ్మిక, బొడ్డుమర్రి ఎస్సీ వీధి, ఎస్టీ వీధి, పాతపట్నం అమ్మవారి గుడి కాలనీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శుక్రవారం హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీరామ్ రమణారావు విఘ్నేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు కమిటీ సభ్యులకు 68 వేలు రూపాయలు విరాళాన్ని అందజేశారు. వినాయక చవితి సందర్భంగా భక్తులు, యువత ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. వినాయక ఉత్సవాలకు ఆర్థిక సహాయం అందించిన శ్రీరామ్ రమణరావుకు ఆయా ఉత్సవ కమిటీల ప్రతినిధులు, స్థానికులు అభినందనలు తెలియజేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పాత బిల్లు పేరుతో.. ప్రస్తుత కనెక్షన్ కట్!

**-పాత మీటర్ బకాయి పేరుతో**

**విద్యుత్ సరఫరా నిలిపివేత**

**సంతబొమ్మాళి, సెప్టెంబర్ 18 (వార్త):** ప్రస్తుత విద్యుత్ కనెక్షన్‌కు బకాయిలు లేకపోయినా పాత మీటర్ బిల్లును కారణంగా చూపి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో మండలంలో యామలపేటలో ఓ కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంది. ఇంట్లో ఏడాది లోపు చిన్నారి ఉండటంతో పాటు తల్లి గుండెజబ్బుతో బాధపడుతున్నప్పటికీ ముందస్తు సమాచారం లేకుండా సరఫరా నిలిపివేశారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. యామలపేటకు చెందిన మోచి పార్వతి ఇంటికి ప్రస్తుతం ఉన్న మీటర్‌పై ఎలాంటి బకాయిలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే గతంలో సొట్ట పద్మనాభం పేరుతో ఉన్న మీటర్‌కు బిల్లు బకాయి ఉందని, దానిని కారణంగా చూపి ప్రస్తుత కనెక్షన్‌ను కట్ చేశారని చెప్పారు. గతంలో ఆ బకాయిని చెల్లించడంతో పాటు మీటర్‌ను కూడా సిబ్బందికి అప్పగించామని, అయితే దానిని రికార్డుల్లో 'స్టాప్'గా నమోదు చేయకపోవడంతో మళ్లీ బిల్లులు వచ్చినట్లు తెలిపారు. పాత బకాయికి సంబంధించిన మొత్తాన్ని చెల్లించి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సిబ్బంది రికార్డు నిర్వహణలో జరిగిన తప్పిదానికి ప్రస్తుత కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఘటనపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ విషయమై సంతబొమ్మాళి ఏఈ శశిభూషణరావును వివరణ కోరగా ఆ ఇంటికి సంబంధించి మరో మీటర్‌పై బిల్లు బకాయి ఉందని, ఆ బకాయిని చెల్లించాలని వారికి సూచించినప్పటికీ బాధ్యత తీసుకోకపోవడంతో సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు.



## లక్ష్మీ లంబోదరుడికి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ



**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** వినాయక నవరాత్రుల సందర్భంగా పలాస లక్ష్మీ షాపింగ్ మాల్‌లో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ లంబోదరుడికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ నిర్వహించారు. లక్ష్మీ షాపింగ్ మాల్ అధినేతలు శ్రీను, స్వామి, రత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాల్‌లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా నవరాత్రుల సందర్భంగా ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ సనాతన ధర్మ సంప్రదాయాలను కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు సామూహికంగా పూజల్లో పాల్గొనడం ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలకు సహకరిస్తున్న లక్ష్మీ షాపింగ్ మాల్ యాజమాన్యానికి కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. మేనేజర్లు స్వామి యాదవ్, గుణ, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాల్ కార్మికులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మబగాంలో పల్లెనిద్ర



**పోలాకి, సెప్టెంబరు 18 (వార్త):** మబగాం గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు పాల్గొని గ్రామంలోని ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి తగాదాలు, వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలని డీఎస్పీ తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకారం, సహాయ సహకారాలు అందించాలని కోరారు. పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాభివృద్ధికి ప్రజల మధ్య ఐకమత్యం ఎంతో అవసరమని, అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. గ్రామంలో స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా పోలీసులు స్థానిక పరిస్థితులను తెలుసుకుని ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో ఎస్సై జి. రంజిత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలిగాంలో వినాయక మహోత్సవాలు



**మందస, సెప్టెంబరు 18(వార్త):** బాలిగాంలో శ్రీవరసిద్ధి వినాయకుని పూజా మహోత్సవాలు భక్తి, శ్రద్ధలతో జరుగుతున్నాయి. గ్రామంలో సుమారు 63 సంవత్సరాలుగా శ్రీవరసిద్ధి వినాయక పూజలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మహిళలు భక్తి, శ్రద్ధలతో కుంకుమ పూజలు జరిపారు. అర్చకుడు సంతోష్ కుమార్ పాణిగ్రాహి వేదమంత్రోచ్చారణలతో పూజలు జరిపించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## మాకివలస పీహెచ్‌సీ వద్ద మెగా వైద్య శిబిరం

**నరసన్నపేట, సెప్టెంబరు 18 (వార్త):** మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రధాని మోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి స్థానిక ప్రజలు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. శిబిరంలో వైద్యులు విజయ్‌కుమార్, వెలమల సీతా మహాలక్ష్మి రోగులను పరీక్షించి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన వారికి మందులను అందజేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి తగిన వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య విధానం, ఆయుష్ వైద్య సేవల ప్రాధాన్యాన్ని వైద్యులు వివరించారు. ఆయుర్వేద పద్ధతుల ద్వారా అనేక అనారోగ్య సమస్యలకు చికిత్స పొందే అవకాశం ఉందని పేర్కొంటూ, ఆయుష్ వైద్య విధానంపై ప్రజల్లో అవగాహన పెంచారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు తగిన చికిత్స పొందాలని సూచించారు. మెగా వైద్య శిబిరం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు లభించడంతో పలువురు ప్రయోజనం పొందారు.





## జిల్లా స్థాయి క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ

**- కోడూరు జెడ్పీ హైస్కూల్‌కు ప్రథమ బహుమతి**

**- శర్వాణి విద్యాలయానికి ద్వితీయ బహుమతి**

**- ప్రియాగ్రహారం ప్రగతి, టెక్కలి అరుణ విద్యాలయాలకు తృతీయ స్థానం**

**పోలాకి, సెప్టెంబరు 18 (వార్త):** గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో జ్ఞానం, ఆత్మవిశ్వాసం, పోటీ స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో పోలాకి మండలం వనవిష్ణుపురంలో జిల్లా స్థాయి క్విజ్–2026 నిర్వహించారు. జఅశ్రీశ్రీఖస్త్రవ-వఎజూశ్రీశీఎవవ.అఅ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. క్విజ్ పోటీల్లో కోడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, షీల్డ్‌ను సాధించారు. నరసన్నపేటకు చెందిన సర్వాణి విద్యాలయం విద్యార్థులు ద్వితీయ బహుమతిగా రూ.3 వేల నగదు, షీల్డ్‌ను దక్కించుకున్నారు. అలాగే ప్రియాగ్రహారం ప్రగతి స్కూల్, టెక్కలి అరుణ విద్యాలయం విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించడం ద్వారా వారిలో విషయ పరిజ్ఞానంతో పాటు ఆత్మవిశ్వాసం, పోటీతత్వం పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. విజేతలను పాఠశాలల ఉపాధ్యాయులు, నిర్వాహకులు అభినందించారు.

## కళాకారుడు ధనుంజయ రెడ్డికి ఘన సన్మానం



**కవిటి, సెప్టెంబరు 18 (వార్త):** కవిటి మండలం ఆర్ బెలగాం గ్రామంలో శ్రీ రాధాకృష్ణ జానపద కోలాటం బృందం సభ్యులు ఇచ్ఛాపురం మండలం టి.బరంపురం గ్రామానికి చెందిన ప్రముఖ జానపద సంగీత గురువు తిప్పన ధనంజయ రెడ్డిని ఆ గ్రామానికి చెందిన శ్రీ వరసిద్ధి వినాయక పూజ కమిటీ, గ్రామ పెద్దలు చేతుల మీదుగా తిప్పన ధనుంజయ రెడ్డి దంపతులకు శుక్రవారం ఘనంగా సన్మానించారు. గత ఐదు నెలలుగా శిక్షణ ఇస్తూ అనేక ప్రదర్శనలు చేయించిన ధనుంజయ రెడ్డి సేవలను గుర్తిస్తూ సమాజానికి లలిత కళలు ఎంతో అవసరమని గ్రామాల్లో ఐక్యత చాటడానికి ఇటువంటి కళలు ఎంతో అవసరమని వక్తలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ, కవిటి ఎంపీపీ కడియాల ప్రకాష్, కంచిలి ఎంపిపి పైల దేవదాస్ రెడ్డి, ఇచ్ఛాపురం ఎంపీపీ బోరా పుష్ప, శ్రీ మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ సభ్యులు, శ్రీ వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు, ఆర్ బెలగం గ్రామ పెద్దలు, శ్రీ కాశీ విశ్వనాథ జానపద కోలాటం సభ్యులు, శ్రీ పోలమ్మ తల్లి జానపద కోలాటం సభ్యులు శ్రీ రాధాకృష్ణ జానపద కోలాటం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాలి

**పలాస, సెప్టెంబరు 18 (వార్త):** విద్యార్థులు విద్యతోపాటు పోటీ తత్వాన్ని పెంపొందించుకుని, తమ ప్రతిభను వివిధ వేదికలపై ప్రదర్శించాలని ఎంఈఓలు సీహెచ్.శ్రీనివాసరావు, సీహెచ్.సత్యం సూచించారు. విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారీ ఆదేశాల మేరకు పలాస మండల వనరుల కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. 'భారతదేశంలో శక్తి వనరుల పాత్ర--2047' అనే అంశంపై మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి అవసరమైన శక్తి వనరులు, వాటి వినియోగం, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ప్రాధాన్యం తదితర అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతోపాటు, సమకాలీన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. మండల స్థాయి పోటీల్లో కాశీబుగ్గ ఉన్నత పాఠశాలకు చెందిన పి.తేజస్విని ప్రథమ స్థానం సాధించింది. ఈ నెల 21న శ్రీకాకుళంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నారు. జిల్లా స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓలు ఆకాంక్షించారు.

ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పి.గౌరీశంకర్, చలపతిరావు, కేశవరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కిల్లి వెంకట్రావుతోపాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచాలి



**నరసన్నపేట, సెప్టెంబరు 18 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు సూచించారు. నరసన్నపేట బోర్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ పట్ల ఆసక్తి చూపుతున్న విద్యార్థులతో ఎంఈవోలు మాట్లాడి వారి అభిరుచులు, నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, దానిని మరింత అభివృద్ధి చేసే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో దాని అవసరం మరింత పెరుగుతుందని ఎంఈవోలు పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే సైన్స్, సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. సైన్స్ సెమినార్ల ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలపై అవగాహన కల్పించడంతో పాటు వారిలో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల ఆసక్తిని గుర్తించి భవిష్యత్ విద్య, సాంకేతిక రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని ఎంఈవోలు కోరారు.

## రహదారులపై వ్యర్థాలు వేస్తే పెనాల్టీలు



**నరసన్నపేట, సెప్టెంబరు 18 (వార్త):** గ్రామాల్లో రహదారులపై వ్యర్థాలను పడవేసి పరిసరాలను అపరిశుభ్రంగా మారిస్తే పెనాల్టీలు విధించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో పి. జగన్మోహన్‌రావు హెచ్చరించారు. నరసన్నపేట మండలం రావులవలస పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో కలిసి గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించిన డిప్యూటీ ఎంపీడీవో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ఇళ్ల నుంచి వెలువడే చెత్తను రహదారుల వెంట, ఖాళీ ప్రదేశాల్లో పడవేయకుండా చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలని సూచించారు. పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ బండి ప్రతిరోజూ వీధుల్లోకి వచ్చి ఇంటింటి నుంచి వ్యర్థాలను సేకరిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సహకరించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల పరిసరాలు కలుషితమవడంతో పాటు ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తామని, నిబంధనలు ఉల్లంఘించి రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకోవడంతో పాటు పెనాల్టీలు విధిస్తామని జగన్మోహన్‌రావు స్పష్టం చేశారు. ప్రజలు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చని తెలిపారు.

## పెన్షన్ దరఖాస్తుల్లో రాజకీయ జోక్యం తగదు

**- అర్హులైన ప్రతి ఒక్కరి దరఖాస్తును స్వీకరించాలని డిమాండ్**

**- సచివాలయ సిబ్బందిపై రాజకీయ ఒత్తిళ్లు తగవని వ్యాఖ్య**

**- అర్హులకు పింఛన్ అందే వరకు పోరాటం : కాంగ్రెస్ నాయకులు**

**నరసన్నపేట, సెప్టెంబరు 18 (వార్త):** కొత్త సామాజిక పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో రాజకీయ జోక్యానికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, శ్రీకాకుళం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి (2024) నాయుడుగారి రాజశేఖర్ డిమాండ్ చేశారు. అర్హతను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు పరిశీలించి నిర్ణయించాల్సి ఉండగా, దరఖాస్తుల స్వీకరణలో రాజకీయ ఒత్తిళ్లు ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని 28 మండలాల్లోని పలు గ్రామ, వార్డు సచివాలయాల్లో కొందరు స్థానిక రాజకీయ నాయకులు సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని రాజశేఖర్ తెలిపారు. తాము సూచించిన వ్యక్తుల దరఖాస్తులనే స్వీకరించాలని కొందరు నాయకులు సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. పింఛన్ మంజూరుకు అర్హత ఉందా లేదా అనే అంశాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించి, స్క్రూటినీ అనంతరం అధికారులు నిర్ణయించాల్సి ఉంటుందని రాజశేఖర్ అన్నారు. ఏ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడికైనా అర్హులైన వ్యక్తుల దరఖాస్తులను అడ్డుకునే అధికారం లేదని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిబంధనల ప్రకారం అర్హులైన వారి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణకు నిర్దేశించిన గడువులోగా అర్హులైన ఏ ఒక్కరూ అవకాశం కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ కొనసాగుతుండగా, అర్హత పరిశీలన, ధ్రువీకరణ తదితర దశల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరగనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా జలుమూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుంట కట్నవీరుడు మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంలోనైనా అర్హులైన వ్యక్తులకు పింఛన్ అందకుండా అడ్డంకులు ఏర్పడితే విషయాన్ని జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ప్రస్తావిస్తామని తెలిపారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరయ్యే వరకు పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546